నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, మంగళవారం 16 ఏప్రిల్ 2024 | SANGAREDDY

రైతుల పోస్ట్‌కార్డు ఉద్యమం

హామీలు అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల ఉత్తరాలు

వినూత్నంగా నిరసన తెలుపుతున్న సిద్దిపేట రైతులు

సిద్దిపేటలో సీఎంకు పోస్టుకార్డు ద్వారా సమస్యలు విన్నవిస్తున్న రైతు



సీఎంకు ఓ రైతు రాసిన పోస్టుకార్డు

సిద్దిపేట, ఏప్రిల్ 15: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం హామీలు అమలు చేయాలని కోరుతూ సిద్దిపేట నియోజకవర్గ రైతులు వినూత్న కార్యక్రమం చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్‌కార్డుల ద్వారా హామీలు అమలు చేయాలని ప్రజాస్వామ్య పద్ధతిలో రైతులు నిరసన తెలిపారు. పోస్ట్ కార్డు ఉద్యమం చేస్తున్న రైతులకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, రైతుసంఘం నాయకులు సంఘీభావం ప్రకటించారు. సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డులో రైతులు సీఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్ ద్వారా ఉత్తరాలు రాశారు. నియోజకవర్గంలోని చిన్నకోడూర్, సిద్దిపేట రూరల్ మండలం రాఘవపూర్, నంగునూరు మండలం నుంచి రైతులు స్వచ్ఛందంగా ఉత్తరాలు రాశారు. ఇచ్చిన హామీలు 100 రోజులైనా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హామీలు అమలు చేయకుంటే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.



నంగునూరు: సిద్దన్నపేట మార్కెట్ యార్డులో ఉత్తరాలు రాస్తున్న రైతులు

బీజేపీ గెలిస్తే పెనుప్రమాదం

హుస్నాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

- **సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి**

హుస్నాబాద్, ఏప్రిల్ 15: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ మళ్లీ గెలిస్తే ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని అనభేరి, సింగిరెడ్డి స్మారక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన పదేండ్లలో బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చివేసే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, అకౌంట్‌లో రూ.15లక్షలు తదితర హామీలు నెరవేర్చలేదన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చినా బీజేపీ చేసేదేమీ లేదన్నారు. రాజ్యాంగాన్ని మార్చితే ప్రశ్నించే గొంతుకలు మాయమవుతాయని, ఏకపక్ష ప్రభుత్వంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. డబ్బుకే ప్రాధాన్యత ఇవ్వకుండా పనిచేసే నాయకుడిని, ప్రభుత్వాన్ని ఎన్నుకునే స్థాయికి ప్రజలు ఎదగాలన్నారు. సమావేశంలో మల్లేశ్, వనేశ్, సంజీవరెడ్డి, మల్లారెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



తాడ్దన్‌పల్లిలో కేసీఆర్ బహిరంగ సభ కోసం జరుగుతున్న ఏర్పాట్లు

అందోల్ గడ్డకు గులాబీ దళపతి

నేడు తాడ్దన్‌పల్లి(సింగూర్ చౌరస్తా) వద్ద కేసీఆర్ భారీ బహిరంగ సభ





సంగారెడ్డి జిల్లా తాడ్దన్‌పల్లి వద్ద బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

- **భారీగా తరలిరానున్న గులాబీ దండు**
- **లక్ష మందికి సరిపోయేలా ఏర్పాట్లు**
- **పరిశీలించిన జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్**

అందోల్, ఏప్రిల్ 15: లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకెళ్తున్న బీఆర్ఎస్ ప్రచారం ముమ్మరం చేసింది. పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ నింపేందుకు మంగళవారం గులాబీ దళపతి, అపర భగీరథుడు కేసీఆర్ అందోల్ గడ్డపై కాలుపెట్టనున్నారు. జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాలకు సెంటర్ పాయింట్‌గా చౌటకూర్ మండలం తాడ్దన్‌పల్లి చౌరస్తా వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించనుండగా అందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం మాజీ మంత్రి హరీశ్‌రావు, జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించగా, మంగళవారం చింతా ప్రభాకర్, చంటి క్రాంతికిరణ్, టీఎన్‌జీవోస్ మాజీ అధ్యక్షుడు మామిండ్ల రాజేందర్, సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి తదితరులు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధి నుంచి అందోల్, జహీరాబాద్, నారాయణఖేడ్, మెదక్ పార్లమెంట్ పరిధి నుంచి పటాన్‌చెరువు, సంగారెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలిరానున్నారు. బహిరంగ సభకు ఆరు నియోజకవర్గాల నుంచి లక్ష పైచిలుకు ప్రజలు, పార్టీ శ్రేణులు రానుండగా వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తాగునీటి వసతితో పాటు పార్కింగ్ ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. జోగిపేట వైపు నుంచి వచ్చే వాహనాలకు బహిరంగ సభ వెనకాల ఉన్న ఫంక్షన్ హాల్ పక్కన, సంగారెడ్డి వైపు నుంచి వచ్చే వాహనాలకు తడ్దాన్‌పల్లి గ్రామంలోకి వెళ్లే రోడ్డు దగ్గర పార్కింగ్ కోసం స్థలాన్ని సిద్ధం చేశారు. వాహనదారులు తప్పనిసరిగా తమకు కేటాయించిన స్థలంలోనే వాహనాలు పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూడాలన్నారు.

బహిరంగ సభకు భారీగా తరలిరావాలి

– ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు అందోల్, సంగారెడ్డి, జహీరాబాద్, పటాన్‌చెరువు, నర్సాపూర్, నారాయణఖేడ్ నియోజక వర్గాల నుంచి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పిలుపునిచ్చారు. సోమవారం తాడ్దన్‌పల్లి వద్ద నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నియోజకవర్గాల నుంచి లక్ష మంది తరలివస్తారని చెప్పారు. అందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. పార్టీ నాయకులు గ్రామాల నుంచి కార్యకర్తలను తీసుకొచ్చి మళ్లీ ఇంటికి చేరేవరకు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. సాయంత్రం 4 గంటలకు మాజీ సీఎం కేసీఆర్ సభా స్థలికి చేరుకుంటారని, ఆలోగా పార్టీ శ్రేణులు మీటింగ్ దగ్గరకు రావాలన్నారు. కార్యక్రమంలో చౌటకూర్ అధ్యక్షుడు శివకుమార్, నాయకులు వీరభద్రరావు, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డి విజయం తథ్యం

- **మెదక్ మాజీఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి**
- **పాపన్నపేటలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం**

పాపన్నపేట, ఏప్రిల్ 15: మెదక్ ఎంపీ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పాపన్నపేట మండల పరిధిలోని యూసూఫ్‌పేటలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి స్వగృహంలో నిర్వహించిన బీఆర్ఎస్ పాపన్నపేట మండల స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికులుగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సీట్లలో మెదక్ మినహా అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించిందని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో సైతం తీవ్రంగా కృషి చేసి ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలన్నారు. ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పనిచేసే వెంకట్రామిరెడ్డి ఎంపీ అభ్యర్థిగా నిలబడడం నియోజకవర్గ ప్రజల అదృష్టంగా భావిస్తున్నామని వెల్లడించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి కలెక్టర్‌గా అపారమైన అనుభవం ఉందని, ప్రజాసేవ చేయాలన్న ఏకైక సంకల్పంతో ఆయన రాజకీయాల్లోకి వచ్చారని, అలాంటి వ్యక్తిని ఎంపీగా గెలిపించాల్సిన అవశ్యకత మనందరిపై ఉన్నదని ఆయన ముఖ్య కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో పాపన్నపేట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు సోములు, గడీల శ్రీనివాస్‌రెడ్డి, ఎలక్షన్ మండల ఇన్‌చార్జి గోసుల శ్రీనివాస్ యాదవ్, ఏడుపాయల దేవస్థానం చైర్మన్ బాలాగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు కుమ్మరి జగన్, మాజీ సర్పంచ్ ఏర్పుల దాసయ్య, ఎంపీటీసీ జ్యోతీసాయిలు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వెంకటేశం, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ప్రస్తుత ఎంపీటీసీలు, ఆయా గ్రామాల అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

యూసూఫ్‌పేటలో మాట్లాడుతున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



సమావేశానికి హాజరైన ముఖ్య కార్యకర్తలు

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

- **మాజీఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్**
- **హుస్నాబాద్‌లో కార్యకర్తల సమావేశం**

సమన్వయ కమిటీల నియామక పత్రాలు అందజేస్తున్న వొడితెల సతీశ్‌కుమార్

హుస్నాబాద్, ఏప్రిల్ 15: కరీంనగర్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన అక్కన్నపేట మండలం, హుస్నాబాద్ పట్టణ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలపై గ్రామాల్లో వివరిస్తూ ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. ఇంటింటికెళ్లి బీఆర్ఎస్ పాలన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన పనుల గురించి చర్చపెట్టాలన్నారు. గతంలో కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్ చేసిన అభివృద్ధి పనులనూ గ్రామగ్రామాన వివరించాలన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి వినోద్‌కుమార్‌కు భారీ మెజార్టీ ఇవ్వడంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం అక్కన్నపేట మండలం, హుస్నాబాద్ పట్టణ ఎన్నికల సమన్వయ కమిటీలను నియమించారు. సమావేశంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, అక్కన్నపేట ఎంపీపీ మాలోతు లక్ష్మీబీలూనాయక్, జడ్పీటీసీ భూక్యా మంగ, బీఆర్ఎస్ నాయకులు ఎండీ అన్వర్, చిట్టి గోపాల్‌రెడ్డి, సుద్దాల చంద్రయ్య, బండి పుష్ప, కన్నోజు రామకృష్ణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాయనకు అవమానం

- **మదన్‌రెడ్డికి కండువా కప్పడానికి మొఖం చాటేసిన సీఎం రేవంత్**
- **అదే సమయంలో బోథ్ మాజీ ఎమ్మెల్యేకు కండువా కప్పిన సీఎం**
- **మాజీ మున్సిపల్ చైర్మన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లకు సైతం కండువా కప్పిన సీఎం రేవంత్**
- **చేసేది లేక మాజీ ఎమ్మెల్యేతో కండువా కప్పుకున్న మదన్‌రెడ్డి**
- **కాంగ్రెస్‌లో ముమ్మందు గౌరవ మర్యాదలు దక్కేనా...**



గాంధీభవన్‌లో నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

నర్సాపూర్, ఏప్రిల్ 15: బీఆర్ఎస్‌లో నర్సాపూర్ నియోజకవర్గాన్నే శాసించిన మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డికి నేడు అవమానాలు తప్పడం లేదు. బీఆర్ఎస్‌లో ఉండగా ఉన్న గౌరవం, పెద్దరికం, హుందాతనం కనుమరుగైంది. కాంగ్రెస్‌లో చేరుతున్నారనే సంకేతాలు వెలువడినప్పటి నుంచి అందరూ ప్రేమతో పిలుచుకునే మదన్‌రెడ్డికి అవమానాలు ఎదురవుతూనే ఉన్నాయి. అవినీతి, అక్రమార్కుల మాటలు విని బీఆర్ఎస్‌ను దూరం చేసుకొని చులకన అయ్యాడని పలువురు నాయకులు చర్చించుకుంటున్నారు. కొందరు నాయకులు వారి తప్పులను, అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి మదన్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేరాలనే ఒత్తిడి తీసుకువచ్చారని ప్రచారం జరుగుతున్నది. ఏప్రిల్ 5 లేదా 6న కాంగ్రెస్‌లో చేరుతారని ప్రచారం సాగింది అయినా చేరలేదు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతానని అనుచరులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. సీఎం ఇంటికి చేరుకోగానే సీఎం బిజీగా ఉన్నారు... గాంధీ భవన్‌లో దీపాదాస్ మున్షీ ఆధ్వర్యంలో చేరికలు ఉన్నాయని అక్కడి వారు చెప్పడంతో చేసేది లేక గాంధీభవన్‌కు పయనమయ్యారు. ఇదే సమయంలో బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు రాజ్ మహ్మద్, రవీందర్‌రెడ్డి ముఖ్యమంత్రి సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పైగా సీఎం రేవంత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గాంధీభవన్ వెళ్లేసరికి అక్కడ దీపాదాస్ మున్షీ లేకపోవడంతో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో మాజీ ఎమ్మెల్యే నారాజ్ అయ్యాడని ఇప్పుడే ఇలా ఉంటే భవిష్యత్తులో ఎలాంటి గౌరవం దక్కుతుందోనని ఆయన అనుచరులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇన్ని అవమానాలు పడుతూ నర్సాపూర్ ఆత్మగౌరవాన్ని గాంధీభవన్‌లో తాకట్టుపెట్టారని ఇతర పార్టీల నాయకులు విమర్శిస్తున్నారు. భారీ సంఖ్యలో కార్యకర్తలను తీసుకెళ్లి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతానని పెద్దాయన చెప్పినప్పటికీ... కాంగ్రెస్ అధిష్టానం నుంచి అనుకున్నంత స్పందన లేకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తున్నది. కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి ఆ పార్టీలో గౌరవమర్యాదలు దక్కుతాయా లేదా అనేది ముమ్మందు చూడాలి.

500 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

- **రూ. 1.05 కోట్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం**
- **రూ. 1.10 కోట్ల విలువైన వాహనాలు సీజ్**
- **పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారుల మెరుపుదాడిలో వెలుగుచూసిన అక్రమం**

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేశ్, అధికారుల బృందం

పటాన్‌చెరు, ఏప్రిల్ 15: ఐదు వందల టన్నుల రేషన్ బియాన్ని సంగారెడ్డి జిల్లా టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లయ్ అధికారులు రైస్ మిల్‌పై దాడి చేసి పట్టుకున్నారు. దాదాపు రూ.2.15 కోట్ల విలువైన బియ్యం, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేశ్ మాట్లాడారు. పాశమైలారంలోని ఒక షెడ్‌ను లీజుకు తీసుకుని నిజామాబాద్, బోధన్‌కు చెందిన ప్రభాకర్‌రెడ్డి రైస్‌మిల్ ఏర్పాటు చేశాడు. రవి అనే వ్యక్తితో రైస్‌మిల్‌ను నడిపిస్తున్నాడు. ప్రజల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసున్న బియాన్ని రైస్‌మిల్లులో పాలిష్ చేసి గన్నీ బ్యాగుల్లో నింపి ఎఫ్‌సీఐ మార్క్ ముద్రించి, లారీల్లో లోడ్ చేసిన అనంతరం బోధన్‌లోని రైస్ మిల్లులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చి, లారీ నెంబర్‌తో ఎఫ్‌సీఐ వే బిల్లులను వినాయక ట్రైడర్స్ రాంపూర్, ఆదిలాబాద్ పేరు మీద తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయ్ గోదాం, ఇచ్చోడా ఆదిలాబాద్‌కు వెళ్తున్నట్లుగా తయారుచేసి రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ప్రజలకు పంపిణీ చేయాల్సిన పీడీఎస్ రైస్‌ను అక్రమంగా కొనుగోలు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ ఎఫ్‌సీఐ రైస్‌తో కలిసి అమ్ముతున్న దాదాపు 500 టన్నుల పీడీఎస్ రైస్‌ను పాశమైలారం మిల్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్నారని ఎస్పీ తెలిపారు. ప్రభుత్వానికి రైస్‌మిల్స్ లెక్కప్రకారం ఇవ్వాల్సిన బియ్యం ఇవ్వకుండా ఇలా పాలిష్ చేసిన బియాన్ని మోసంతో అందజేస్తున్నారని తెలిపారు. ఈ దాడి సమయంలో నిందితుడు ప్రభాకర్‌రెడ్డి పరారయ్యాడని చెప్పారు. 500 టన్నుల బియ్యాన్ని అధికారులు పట్టుకుని సివిల్ సప్లయ్ అధికారులకు అందజేశారు. బియ్యాన్ని తీసుకొచ్చిన 3 లారీలు, 4 డీసీఎంలను సీజ్ చేశారు. రవిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్పీ రూపేశ్ వివరించారు. దాడిలో పాల్గొన్న పోలీసు, సివిల్ సప్లై అధికారులను సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కిశోర్, ఇన్‌స్పెక్టర్ శేఖర్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో సివిల్ సప్లయ్ ఎస్పీ శశిధర్‌రాజు, అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ రవీందర్‌రెడ్డి, బీడీఎల్ సీఐ రవీందర్‌రెడ్డి, సివిల్ సప్లయ్ అధికారి వనజాతారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.